# ★ అతని బాధ ★

• చంద్రమౌళి సుబ్రహ్మణ్యం •

కాషాయ వస్త్రధారణ, ఎడమచేతిలో కమండలము, కుడిచేత దండము, చంకన చిన్న మూట, భుజాన వేలాడుతున్న కొయ్యబొచ్చె ధరించినవాడై బంగాళాదేశములోని కుగ్రామపు బజారువెంట నడుస్తున్నాడు. పోలికలో హిందూ ఋషి, మహమ్మదీయుల మౌలానా, కాషాయ వస్త్రములు ధరించినవాడగుటచే క్రైస్తవుడు కాదనుకోటానికి వీలులేదు. బిషప్పులను బోలిన బారుగడ్డము, పెరిగిన తలవెండ్రుకల గిరజాలు వేలాడుతున్నై.

నడుస్తున్నాడు—ఎక్కడికో?- ప్రపంచమంతా తనదే. అందులో తానొకడే. పెళ్లామా? బిడ్డలా? వంటకాలా? భోజనాలా? ఆ తాపత్రయమే లేదు. ఆకలయినప్పుడు ఏ గృహస్థు ఇంటిముందుకో వెళ్ళి "భిక్షాందేహి" అంటాడు. దొరికిన నాలుగు అన్నంమెతుకులు ఆపూట కాహారం. దొరకని పూట ఏదీలేదు; ఉంది—సృష్టి—అరణ్యాల్లోని కాయలు, పండ్లు.

పగటిపూట అరణ్యాలే శరణ్యాలతనికి. అక్కడే ఏ అల్లానో, ఏ క్రైస్తునో, పరమహంసనో వీళ్లెవరూ కాకపోతే రవీంద్రుణ్ణో తలుచుకొంటాడు.

రాత్రిళ్లు పల్లెల్లోనూ, పట్నాల్లోనూ సంచారం చేస్తుంటాడు. పట్టణాల్లోకంటె పల్లెల్లో ఆనందంగా అవుపిస్తుంటాడు.

అతనికి మతం లేదు, కులం లేదు. ఎక్కడికైనా పోతాడు. ఎవరు వండినా తింటాడు. ఆతిధ్యాలకు పోడు. బిచ్చం అతని పని. అది తన వృత్తిగాదు. క్షుద్బాధను గృహస్థుద్వారా నివారించుకోవాలనే సంకల్పం. ఒకర్ని కష్టపెట్టడు. తనకే కష్టమూ లేదు.

కాని ఒకటే బాధ—అమాయిక క్షుద్రజంతువులు మానవుల ఆహారంకోసం చనిపోతూ పడే బాధల్ని చూడలేడు. సహించలేడు. అవి గిలగిల కొట్టుకొంటుంటే అతని గుండెదెబ్బలు ముళ్లు పోట్లవలె గుచ్చుకొంటుంటై. ఎంతో బాధనిపిస్తుందతనికి. ఏం చెయ్యగలడు?

మత కక్షలతో మనుష్యులూ మనుష్యులూ కొట్టుకొంటున్నారు, చంపుకొంటున్నారు. వాళ్ళ బాధ తన బాధగాదు. ఎందుకంటే-వాళ్లూ తన మోస్తరు మానవులే. ఇంగితజ్ఞానంగల ప్రాణులే, భూతదయ ఉండాల్సిన హృదయాలే!

ఏ మానవుడే దుష్కార్య మాచరించినా సహిస్తాడు. సప్త వ్యసనాల్లో బడి మత్తెక్కి మదించినా తనకు బాధనుకోడు. కాని జాలి చూపుతాడు.

పూర్వం రాజాధిరాజులు వేటాడే వారంటే, రాత్రించరులవలె చరించే క్రూరజంతువులను దునుమాడ్చి, ప్రజకు అపాయంలేకుండా చేసేవారు. ఆ వేట బాణాలతో ఉండేది. అదియొక ధర్మయుద్ధం—

క్రూరజంతువులను వధించడం అతనికిష్టమే. కాని, వాటి రక్తాన్ని మింగి వాటివలె చరించటం అతని కడుపులో బాధ. అమాయక జంతువులపై గల అతనిప్రేమ. మాంసాహారం అసలే పనికి రాదని పలుకుతాడు. బుద్ధునివలె నిలబడతాడు.

అతని మాటలు వినేవాళ్లూ ఉన్నారు, విననివాళ్ళూ ఉన్నారు మాంసాహారం విషయంలో అతని వాదాన్ని జయించగలిగే వాళ్ళుమాత్రం శూన్యం. పశుపక్షులయందు తనకు గల అమిత




ప్రేమే అతనిలోని అద్భుతశక్తి. అదే అతనిలో గొప్పతనం.

ఎవరు పలుకరించినా పలుకుతాడు. ఏ భాషనైనా మాట్లాడుతాడు. ఇతరప్రసంగాలకుమాత్రం ఇచ్చగొనడు. "మాంసాహారం ఎందుకు మానాలి?—ఇది అతనికి కావలసిన ప్రసంగం.

"యేం? వృక్షములుమాత్రం ప్రాణులుగావూ? మొక్కలో ప్రాణంలేదూ? పంటమొక్కల్లోది ప్రాణంగాదూ? వాటిని తుంచివేయటం వాటి ప్రాణాలకు హానికాదూ? ఇటువంటి ప్రశ్నలకు తేలికగా సమాధానం చెప్పగలడు. నిష్కల్మష మానవ హృదయాల్ని మంచిత్రోవకి తీసుకు రాగలడు. శాకాహారంలో గొప్ప ఉందని సునాయాసంగా ఋజువుపర్చగలడు.—

"ఉంది నాయనా ఉంది. వృక్షంలోనూ ప్రాణంఉంది, మొక్కలోనూ ప్రాణంఉంది. కాని రక్తం లేదు. వృక్షాన్ని పాడుచెయ్యొద్దు. అదిచ్చే కాయల్ని తనివిదీర భక్షించు. నీవెంత భక్షిస్తే వాటిగింజలవల్లగలిగే లాభం వృక్షజాతిని వృద్ధిజేయడానికి అంత ఉంటుంది. అదిగూడా నీ మేలుతోనే చేసికో. వాటిని సృష్టించేందుకు సహాయపడేవాడివి నీవే. నీవే అనుభవించు. అనవసరంగా వధింపకు. నీ బిడ్డను నీవు చంపుకొంటావా? జంతువులను సృష్టించేందుకు నీ సహాయమెందుకు?

వంటకట్టెలకు వృక్షాల్నిగూడ నరకాల్సొస్తుందంటే అటువంటి చెట్లు వేరేఉన్నై. వాటికి కాయలే గాయవు. వాటి పుటకే వంటకట్టెలకు.

కాయగూర్లకు, పంటకు మొక్కల్ని నీవే సృష్టింపచేస్తున్నావు. గింజలున్నా పరిశ్రమ నీదే. జీవశక్తి నీదే. ఆ మొక్కలిచ్చే కాయలు, ధాన్యం తింటున్నావు. చేలల్లో పక్షులు, జంతువులు, క్రిములు తింటుంటే చూస్తున్నావు. పండినది అనుభవిస్తున్నావు. అది మాంసాహారమెట్లా అవుతుంది:

ఒక్కసారి కళ్లుతెరిచిచూస్తే మాంసమెట్లా ఉంటుందో కనిపిస్తుంది. మాంసాహారం ఎందుకు మానాలో తెలుస్తుంది ప్రాణాల బాధలు అవుపిస్తై. చెవులువిప్పి వింటే వాటి ఆర్తనాదాలు వినిపిస్తై."